క్లుప్తంగా

మండల ప్రజల సహకారం మరువలేను



ఇన్‌చార్జి ఎంపీడీఓ సుమిత్రమ్మ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పాములపాడు: మండలంలో ప్రజలు, అధికారులు అందించిన సహకారం మరువలేనని ఎంపీడీఓగా పదోన్నతి పొంది వైఎస్సార్ జిల్లాకు బదిలీ అయిన ఇన్‌చార్జి ఎంపీడీఓ సుమిత్రమ్మ అన్నారు. సోమవారం ఆమె రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఫణీశ్వరరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కరుణసాగర్, ఏపీఓ విమలమ్మ, ఏపీఎం అనురాధ, సిబ్బంది దుశ్శాలువా, పూల మాలలతో ఎంపీడీఓ దంపతులను సత్కరించారు.

మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష హాల్ టికెట్ల విడుదల

వెలుగోడు: స్థానిక ఏపీ ఆదర్శ (మోడల్) పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షలకు హాల్ టికెట్లు విడుదలైనట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆదర్శ (మోడల్) పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 11న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం హాల్ టికెట్లు విడుదల చేసినట్లు ఏపీ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ శ్రీ ఎం.వి.కష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. హాల్ టికెట్లను apms. apcfss. in వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

రైతులకు జీలుగ విత్తనాల పంపిణీ



జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ పవన్

వెలుగోడు: మండలంలోని రైతులకు సోమవారం జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 208.70 క్వింటాల విత్తనాలను అందజేసినట్లు ఏవో పవన్ కుమార్ తెలిపారు. అనంతరం మండల పరిధిలోని విత్తన షాపులను తనిఖీ చేసి అనధికారికంగా నిలువ చేసిన 59.88 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలకు (విలువ రూ.26,49, 440) స్టాప్ సేల్ నోటీసు ఇచ్చారు. అలాగే బోయరేవుల గ్రామంలో ఆర్‌బీకేను సందర్శించి రిజిష్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో నాగశివసాయి, వీహెచ్‌ఏ వెంకటశివుడు, రామకష్ణ, నాగమణి, రామలక్ష్మీ పాల్గొన్నారు.

ఎంపీడీఓగా గోపీకృష్ణ బాధ్యతల స్వీకరణ



పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గోపీకృష్ణ ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ డ్వామా కర్నూలు కలెక్టరేట్ ఏఓగా విధులు నిర్వహిస్తూ పదోన్నతితో బదిలీపై పాములపాడుకు వచ్చానన్నారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఆయనకు బొకే అందజేసి స్వాగతం పలికారు. అలాగే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఆలంబాషా ఆత్మకూరు ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మిడుతూరు నుంచి బదిలీపై వచ్చిన చక్రవర్తి బాధ్యతలు చేపట్టారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

మిడుతూరు: స్థానిక ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి సప్లమెంటరీ పరీక్షా కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్, నంద్యాల ఎంఈఓ బ్రహ్మం నాయక్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాలలో సప్లమెంటరీ పరీక్షలకు విద్యార్థులు అధిక శాతం గైర్హాజరతున్నారని బ్రహ్మం నాయక్ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 22 మందికి 13 మంది గైర్హాజరయ్యారని, ఆదర్శ పాఠశాలలో 41 మందికి 15 మంది గైర్హా జరైనట్లు పరీక్షల నిర్వహణ అధికారులు నాగరమేష్, పార్వతి తెలిపారు.

సంగమేశ్వరం రెస్టారెంట్‌కు బహిరంగ వేలం

నంద్యాల(అర్బన్): కొత్తపల్లె మండలం సంగమేశ్వరం వద్దనున్న పర్యాటక శాఖ రెస్టారెంట్ వార్షిక అద్దె కేటాయింపుపై ఈనెల 15న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు వ్యక్తులు, సంస్థలకు వార్షిక అద్దెపై బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల వారు ఈనెల 15లోపు రూ.2వేలు ధరావత్తు చెల్లించి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మొదటి అంతస్తులో నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు. వివరాలకు సెల్ : 7995087089, 9121144105 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొండెక్కిన కోడి మాంసం ధర

- పొట్టేళ్ల ధరలు తగ్గినా రేటు తగ్గించని మటన్ వ్యాపారులు
- నిరాశలో మాంసం ప్రియులు



ఆత్మకూరు చికెన్ దుకాణాలకు చేరుకున్న కోళ్లు

ఆత్మకూరు: పట్టణంలో చికెన్ ధరలు కొండెక్కాయి. కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఊహించని విధంగా భారీగా పెరిగాయి.

రెండువారాల క్రితం చికెన్ రూ.180 నుంచి రూ.200 ధర పలుకగా ఆదివారం రూ.300 దాకా అమ్మకాలు జరిగాయి. ఏరువాక పౌర్ణమి, శుభ కార్యాలు ఉండటంతో ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో కంగుతినడం మాంసం ప్రియుల వంతైంది. చికెన్‌విక్రయదారులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే ధరలు పెంచుతూ అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. వాస్తవానికి నందికొట్కూరు, జూపాడు బంగ్లాలో చికెన్ విక్రయాలను పరిశీలిస్తే చాలా వరకు ధరలు తక్కువగానే ఉన్నాయి. కానీ ఆత్మకూరులో ఎక్కువగా ధరకు అమ్మకం పట్ల కొందరు ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి వారు మాంసం కొనాలని ఆశతో వెళ్తే ధరలు పెరిగినందుకు పావుకిలో, లేదా అరకిలోకి పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మార్కెట్ లో పొట్టేళ్ల ధరలు తగ్గినా తగ్గని మాంసం ధరలు

ఆత్మకూరు పట్టణంలో ప్రతి శనివారం మేకలు, పొట్టేల అమ్మకాల సంత జరుగుతుంది. పొట్టేళ్లు, మేకలు కావాల్సిన వారు ఆత్మకూరు పట్టణంతో పాటూ వెలుగోడు, పాములపాడు, కొత్తపల్లి మండలాలకు చెందిన గ్రామాల ప్రజలు కూడా సంతకు వచ్చి పొట్టేలు , మేకల కొనుగోలు చేస్తున్నారు. గత రెండు వారాలుగా ఆత్మకూరు సంతమార్కెట్ లో వీటి ధరలు గణనీయంగా తగ్గాయి. 25 నుంచి 30 కిలోల పొట్టేళ్లు ఎంతో నాణ్యత కూడినప్పటికి వీటి ధర కేవలం రూ.15 నుంచి 16 వేల లోపు మాత్రమే అమ్మకాలు జరిగాయి. 15 నుంచి 20 కిలో మాంసం లభించే పొట్టేళ్లు రూ.7 నుంచి 10 వేల లోపు మాత్రమే ధరలు పలికాయి. ఇలా పొట్టేళ్లు , మేకల ధరలు భారీగా తగ్గినప్పటికి వీటిని విక్రయించే వారు మాత్రం ధరలు తగ్గించలేదు. పలు మార్కెట్లుల్లో చికెన్, మాంసం ధరలు తగ్గించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కొనాలంటే ఆలోచించాల్సి వస్తోంది



మండు వేసవికి కోళ్ల చనిపోతున్నాయని చికెన్ ధరలు పెంచారు. వేసవికాలం ముగియ వచ్చింది. ప్రస్తుతం ఏరువాక పౌర్ణమి వచ్చినప్పటికీ చికెన్ ధరలు తగ్గకపోవడం విడ్డూరం. ధరలు భారీగా పెరగడంతో చికెన్ ఆలోచించి కొనాల్సి వస్తోంది.

–రామకృష్ణారెడ్డి, ఆత్మకూరు

చికెన్ ధరలు భారీగా పెంచేశారు



గత రెండు వారాల క్రితం కేవలం కిలో రూ.200 లకు అమ్మిన చికెన్ దుకాణదారులు, ప్రస్తుతం రూ.300 పెంచడం సరికాదు. ఆది వారం వచ్చిందంటే పేదలు , ధనికులు అని తేడా లేకుండా మాంసాన్ని కొనుగోలు చేస్తారు. ప్రస్తుతం చికెన్, మాంసం ధరలు పెరగడం సరికాదు. అధికారులు స్పందించి ధరలు తగ్గించాలి

–వెంకటేశ్వర్లు, ఆత్మకూరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పగిడ్యాల: పుట్టింటికి వెళ్లిన భార్యను తీసుకొచ్చేందుకు సుల్తానాపురం నుంచి పాలమర్రి గ్రామానికి బయలుదేరిన ఓ వ్యక్తి మార్గమధ్యంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. సోమవారం నందికొట్కూరు–పగిడ్యాల రోడ్డులో బాదనమ్మ బావి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సుల్తానాపురం గ్రామానికి చెందిన రాఘవేంద్ర పగిడ్యాల మండలం పాలమర్రి గ్రామంలోని లక్ష్మన్న కూతురు శిరీషను పెళ్లి చేసుకున్నాడు. కొద్ది రోజుల క్రితమే అతని భార్య పుట్టింటికి వచ్చింది. భార్యను తీసుకెళ్లడానికి బైక్‌పై బయలుదేరిన రాఘవేంద్రను నందికొట్కూరు నుంచి పడమర ప్రాతకోటకు బయలుదేరిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాఘవేంద్ర తలకు తీవ్ర రక్త గాయాలు అయ్యాయి. గమనించిన ఆటోలోని ప్రయాణికులు పెద్ద పెద్ద ఎత్తున కేకలు వేసి కారును వెంబడించి ఆపేందుకు ప్రయత్నించారు. అయితే డ్రైవర్ కారును ఆపకుండా పరారయ్యాడు. రక్తపు మడుగులో పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న బాధితుడిని ఆటోలోని ప్రయాణికులు 108 వాహనంలో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జునను అడుగగా ప్రమాదం జరిగినట్లు తమ దృష్టికి కూడా వచ్చిందని, ఢీ కొట్టిన కారు వివరాలను నందికొట్కూరు, లక్ష్మాపురం అంచె వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలలో పరిశీలించి ఆచూకీ తెలుసుకుంటామన్నారు.

ఉపాధి పనులు కల్పించండి



బండిఆత్మకూరు ఎంపీడీఓకు వినతి పత్రాలు ఇస్తున్న ఉపాధి కూలీలు

మహానంది: గత ఇరవై రోజులుగా ఉపాధి పనులు లేక అల్లాడిపోతున్నామని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, ప్రస్తుతం ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ స్థానంలో ఎవరినైనా నియమించి పనులు కల్పించాలని ఉపాధి కూలీలు నిరసన వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు సుమారు వంద మంది సోమవారం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని ఆందోళన వ్యక్తం చేశారు. సర్పంచ్ షబ్బీర్ అహమ్మద్, ఉప సర్పంచ్ రామలింగేశ్వర రెడ్డిల ఆధ్వర్యంలో ఎంపీడీఓ వాసుదేవగుప్తకు వినతిపత్రాలు, ఫిర్యాదులు అందజేశారు. పనులు లేక ఇరవై రోజులవుతుందని, ప్రస్తుతం ఉన్న ఎఫ్‌ఏ మల్లికాదేవి మాకొద్దంటూ, ఎవరినైనా నియమించి పనులు కల్పించాలని ఉపాధి కూలీలు కోరారు. ఈ విషయంపై ఎంపీడీఓ వాసుదేవగుప్త మాట్లాడుతూ ఉపాధి కూలీలు ఇచ్చిన ఫిర్యాదులు, వినతిపత్రాలను ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు పంపిస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. పనులు కల్పిస్తామని చెప్పారు.

ఆలయాల భూములకు పోటాపోటీగా వేలాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం పెద్దదేవళాపురం, నారాయణపురం గ్రామాల్లోని ఆలయాల భూములకు నిర్వహించిన వేలాలు పోటాపోటీగా జరుగగా.. గతేడాది కంటే ఈ ఏడాది కౌలు ఆదాయం పెరిగినట్లు ఈఓ నాగ ప్రసాద్ తెలిపారు. రెండు గ్రామాల్లో సోమవారం వేలాలు నిర్వహించారు. ఈఓ నాగ ప్రసాద్ మాట్లాడుతూ పెద్దదేవళాపురం గ్రామంలోని శ్రీ వరదరాజ, ఆంజనేయ, లింగమయ్య స్వామి దేవస్థానాలకు చెందిన 40.30 ఎకరాల భూములకు గతేడాది రూ.5.22లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది రూ. 12,35,200 వచ్చిందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది రూ. 7,13,200 పెరిగిందన్నారు. నారాయణపురం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి, శ్రీ నారాయణస్వామి ఆలయాలకు చెందిన 18.82 ఎకరాల భూములకు గత ఏడాది రూ. 1.96 లక్షలు రాగా ప్రస్తుతం రూ. 4,86,500 వచ్చిందని, దీంతో ఈ ఏడాది రూ. 2.90లక్షలు అదనపు ఆదాయం వచ్చిందని వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ వై.రమణమ్మ, ధర్మకర్తలు, రైతులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు రూరల్: స్పందన అర్జీలకు సంబంధించి రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి అర్జీదారులు సంతృప్తి చెందేలా అధికారులు పరిష్కారం చూపాలని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కిషోర్ ఆదేశించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై వర్క్ షాప్ నిర్వహించి అర్జీల పరిష్కారంపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఆశీర్వాదమ్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో సమస్యల పరిష్కారం

కొత్తపల్లి: స్పందన కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీఓ మేరి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ సమస్యపై ఇద్దరురైతులు, భూమి కొలతల విషయమై ఓరైతు, రేషన్‌కార్డు కోరకు మరోకరు అర్జీలు సమర్పించారని వారు తెలిపారు. వీటిని సంబధిత అధికారులకు బదిలీ చేశామని త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు.

గోశాలకు దాణా వితరణ



మహానంది గోశాలకు దాణా అందజేస్తున్న గౌరీనాథ్ దంపతులు

మహానంది: నంద్యాల పట్టణంలోని ఏజీఎన్ జ్యూవెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్ తన పుట్టిన రోజున హంగూ, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చి గోశాలలోని గోవులకు అర్చకులు శరభయ్య ఆధ్వర్యంలో దాణా అందించి తన భక్తిని చాటుకుంటున్నారు. ఈ మేరకు వారికి వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాంభట్‌లు వేదాశీర్వచనం చేసి స్వామి,అమ్మవార్ల ప్రసాదాలు అందించారు. మహానందిలో ప్రతి ఏడాది మహాశివ రాత్రి రోజున జరిగే కళ్యాణోత్సవం అనంతరం స్వామి,అమ్మవార్ల తెప్పోత్సవానికి కొన్నేళ్లుగా గౌరీనాథ్, సరస్వతి దంపతులు దాతలుగా వ్యవహరిస్తున్నారు. అలాగే ప్రతి ఏడాది వరలక్ష్మీవ్రతం రోజున పూజలు జరిపించి వందలాది మంది భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు పంపిణీ చేస్తూ వస్తున్నారు. వీటితో పాటు పలు సేవా కార్యక్రమాలు చేస్తూ మహానందీశ్వరుడిసేవలో తరిస్తున్నారు.

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలంటెంపుల్: జ్యోతిర్లింగక్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రమైన శ్రీభ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. ముందుగా దేవాలయ ప్రాంగణంలోని పురాతన మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో సహస్రదీపార్చన పూజలు జరిపించారు. ఈ సేవలో భాగంగా మండపంలో వెయ్యి దీపాలను వెలిగించి, ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను వెండిరథంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎస్.లవన్న, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకారమండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార హారతులు, శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం చేపట్టారు. వేసవి సెలవులు, సోమవారం కావడంతో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామిఅమ్మవార్ల దర్శనం రాత్రి వరకు నిర్విరామంగా కొనసాగింది.

విద్యా కానుక కిట్లు పాఠశాలలకు తరలింపు



విద్యా కానుక కిట్లను పాఠశాలలకు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో నిల్వ చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను ఆయా పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యను బట్టి తరలిస్తున్నట్లు మండల విద్యాధికారి సుభాన్ తెలిపారు. సోమవారం ఆయన ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ మరో వారం రోజుల్లో పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యా కానుక కిట్ల తరలింపుకు చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం జగనన్న విద్యా కానుక కింద 23 వేల పాఠ్యపుస్తకాలు, 3,503 మంది విద్యార్థులకు స్కూల్ యూనిఫాం దుస్తులు, షూ, టై, సాక్సులు, బెల్టులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు, బొమ్మల డిక్షనరీలు మంజూరు చేసిందన్నారు. క్లష్టర్‌ల వారీగా విద్యా కానుక కిట్లను పాఠశాలలకు తరలిస్తున్నామని ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తగా ఎలుకలు సంచరించని ప్రదేశంలో భద్రపరుచుకోవాలని ఆదేశించారు.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలి



ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నందికొట్కూరు: మహిళా క్రీడాకారులపై వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. పటేల్ సెంటర్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల చాటిన రెజ్లర్లపై భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు శంకర్, మధు, శ్రీను, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుంకులాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ



నూతనంగా ప్రతిష్ఠంచిన అమ్మవారి విగ్రహం

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో సోమవారం సుంకులాపరమేశ్వరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు పవన్‌కుమార్ శర్మ బృందం విశేషపూజలు నిర్వహించారు. వేద మంత్రాలతో యంత్రప్రతిష్ఠ, అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ, కూష్మాండబలి, పూర్ణాహుతి పూజలతో ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జెడ్పీటీసీ సభ్యులు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు, విగ్రహ ప్రతిష్ఠ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు

విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆరు పండ్ల విభాగంలో వృషభరాజములు బండలాగుడు పోటీలు మంగళవారం నిర్వహించనున్నారు. విజేతలకు వరుసగా రూ.30,000, రూ.20,000, రూ.15,000, రూ.10,000, రూ. 5,000, రూ. 4,000 ల చొప్పున నగదు బహుమతులు అందజేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలకు 9959660100, 9603844356, 9963799736 నెంబర్లను సంప్రదించాలని వివరించారు.

యువకుడికి జైలుశిక్ష

మహానంది: తిమ్మాపురం గ్రామానికి చెందిన బి.విశ్వేశ్వరయ్యకు వారం రోజుల జైలుశిక్ష విధిస్తూ నంద్యాల సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి తీర్పు ఇచ్చినట్లు మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం ఎస్‌ఐ మాట్లాడుతూ తిమ్మాపురం గ్రామానికి చెందిన బి.విశ్వేశ్వరయ్య గ్రామంలో అల్లరి చేస్తుండగా కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని చెప్పారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్‌లోనూ పట్టుబడిన ఆ యువకుడికి రెండు కేసుల్లో వారం రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని చెప్పారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి

ఆత్మకూరు: ఒడిశాలో జరిగిన ప్రమాదంలో మరణించిన ప్రయాణికులకు సీపీఎం ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద సోమవారం రాత్రి కొవ్వొత్తులతో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ మాట్లాడుతూ ఘోర రైలుప్రమాదం జరగడం దురదృష్టకరమన్నారు. మూడు రైళ్లు ఒకదానితో ఒకటి ఢీకొన్న ఘటనలు చరిత్రలో లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి రైల్వే ప్రయాణికుల పట్ల నిర్లక్ష్యం వీడాలని, బాధిత కుటుంబ సభ్యులకు పెద్ద ఎత్తున నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ప్రమాదానికి ప్రధాని మోదీ పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు స్వాములు, రాంనాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, ఈరన్న, అంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలి

ఆత్మకూరు: పట్టణంలో చెత్తా చెదారం నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం పట్టణంలో మున్సిపల్ కార్మికులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 24వ వార్డుల్లో ఎప్పటికప్పుడు కార్మికులు శుభ్రం చేయాలన్నారు. వర్షా కాలం రానున్నందున రహదారులు, కాలనీల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా సత్వర చర్యలు తీసుకోవాలన్నారు.

గొడవలకు తావివ్వొద్దు



లింగాపురం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హుస్సేన్‌బాషా

కొత్తపల్లి: గ్రామాలు ప్రశాంతతకు మారుపేరని, గ్రామాల్లో అల్లర్లు, గొడవలకు ప్రజలు తావివ్వకూడదని ఎస్‌ఐ హుస్సేన్ బాషా అన్నారు. సోమవారం మండలంలోని లింగాపురం, గోకవరం, ఎదురుపాడు గూడెం గ్రామాలలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎవరైన గొడవలు, అల్లర్లు సృష్టించి ప్రశాంతతకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గూడెలలోని గిరిజనులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గిరిజనులు విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం కొత్తపల్లి, ఎం.లింగాపురం గ్రామాల శివారుల్లో వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలులేని వాహనాలపై 10 కేసులు నమోదు చేసి రూ.1350 జరిమానా విధించారు. సిబ్బంది ప్రసాద్‌నాయక్, సుదర్శన్ ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి సిబ్బందిని హెచ్చరిస్తున్న ఎంపీడీఓ

పగిడ్యాల: కర్నూలు– కడప(కేసీ) కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు చేపట్టిన ఉపాధి పనులను ఎంపీడీఓ వెంకటరమణ సోమవారం పరిశీలించారు. స్థానిక బంగ్లా కట్ట శివాలయం, రాయలచెరువు ఒకటో స్లూయిస్‌ల వద్ద కేసీ కాలువలో ఎత్తిపోస్తున్న పూడిక పనులకు హాజరైన ఉపాధి కూలీల డీ మస్టర్ అటెండెన్స్‌ను రీ వెరిఫికేషన్ చేశారు. సెల్‌లో అప్‌లోడ్ చేసిన అటెండెన్స్‌ను క్రాస్ చెక్ చేసి కూలీలకు పలు సూచనలు చేశారు. జాబ్‌కార్డు కలిగిన వ్యక్తులే పనులకు హాజరు కావాలన్నారు. వారి స్థానంలో వేరే వ్యక్తులు వస్తే బోగస్ హాజరు కిందికి వస్తుందన్నారు. తమ పరిశీలనలో బోగస్ హాజరును గుర్తిస్తే ఆ మస్టర్‌ను బోగస్‌గా భావించి రద్దు చేస్తామని హెచ్చరించారు. ఏపీఓ మద్దిలేటి, ఈసీ అశోక్, ఫీల్డ్‌అసిస్టెంట్ రమేష్ తదితరులు ఉన్నారు.

బేగరులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలి

కొత్తపల్లి/వెలుగోడు: తరతరాలుగా శ్మశానాల్లో గుంతలు తీస్తూ జీవిస్తున్న బేగరీలను ప్రభుత్వం గుర్తించి 45 సంవత్సరాలు దాటిన వారికి రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సంపత్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. సోమవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో వెలుగోడు మండల కేంద్రంలో, కొత్తపల్లి మండలంలోని శివపురం, ముసలమడుగు, కొత్తపల్లి, గువ్వలకుంట్ల, దుద్యాల, నందికుంట తదితర గ్రామసచివాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ శ్మశానంలో గుంతలు తీసే బేగరీలను రాష్ట్ర ప్రభుత్వం నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి, ఐడీ కార్డు ఇచ్చి, పెన్షన్, ఇంటి స్థలాలు ఇచ్చి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కరోనాకాలంలో చనిపోయిన వారిని వారి పిల్లలు, కుటుంబసభ్యులు ముట్టుకోకపోయినా బేగరీలు ముందుకొచ్చి పూడ్చడం జరిగిందన్నారు. ఆ క్రమంలో కరోనా సోకి దాదాపుగా 20 మంది బేగరీలు చనిపోయారు అన్నారు. కార్యక్రమాల్లో బేగరీలు చిన్న చిన్నయ్య, దేవ సహాయం, శివన్న, రవి, గుండం చెన్నయ్య, కుళాయి, ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: శ్మశాన కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు జారీ చేయాలని కేవీపీఎస్ మండల మహిళా అధ్యక్షురాలు గంధం ఉసేనమ్మ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సచివాలయం –2 కార్యదర్శి మంజులాదేవికి వినతి పత్రం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ



మొక్క నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారుఫ్, అటవీశాఖ అధికారులు



గువ్వలకుంట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ఆత్మకూరు: పర్యావరణాన్ని పరిరక్షించుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారుఫ్ అన్నారు. పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. ప్రధానంగా ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు మొక్కలు నాటారు.

ఆత్మకూరురూరల్: ప్రపంచ పర్యావరణదినోత్సవం సందర్భంగా నల్లకాల్వ గ్రామ సమీపంలోని వైఎస్సార్ స్మృతివనంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియా మారూఫ్ మొక్కలు నాటారు. ఓపెన్ ఆడిటోరియంలో ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ అలన్ చోంగ్ టెరాన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యాన్ని వక్తలు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓలు ఎర్రస్వామి, రామకోటి, ఏకే ఖాన్, శ్రీనివాసులు, శివనాగయ్య, మగ్బూల్, మద్దిలేటి, మంజుల పాల్గొన్నారు.

నందికొట్కూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జంతుశాస్త్ర విభాగం అధ్యక్షతన ప్లాస్టిక్ కాలుష్య నివారణ నియంత్రణ అనే అంశంపై జాతీయ అంతర్జాల సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్. సునీత, అధ్యాపకులు స్వప్నశ్రీ, మహమ్మద్‌గౌస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి చాందిని, వీఆర్వో కృష్ణారెడ్డి మిషన్‌లైఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పర్యావరణాన్ని ఏలా కాపాడుకోవాలన్న విషయాలపై గ్రామంలో సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లతో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

వెలుగోడు: గుంతకందాల గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఏపీవీహెచ్‌ఏ సహకారంతో స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మేలు అచ్చమ్మ, యూత్ అసోసియేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్ అలీ హసన్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఖాదర్‌లు పాల్గొన్నారు.

మహానంది: గాజులపల్లెలో ఏపీ మదాసి కురువ రిజర్వేషన్ పోరాట సమితి శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ గజ్జ పెద్ద పక్కీరయ్య మొక్కలు నాటి ర్యాలీ చేపట్టారు. ఎఫ్ఆర్‌ఓ ఈశ్వరయ్య, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మహానంది: పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బండిఆత్మకూరు ఎంపీపీ దేరెడ్డి చిన్నసంజీవరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీఓ వాసుదేవగుప్త, సర్పంచ్ షబ్బీర్ అహమ్మద్, ఉపసర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.